# వడగండ్ల వాన బీభత్సం

**ఫరూఖ్‌నగర్ మండలంలో 569 ఎకరాల్లో పంట నష్టం**

**నష్టపోయిన 659 మంది రైతులు**

**పంటలను పరిశీలించిన అధికారులు**





గంట్లవెల్లి గ్రామంలో నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి నిషాంత్

షాద్‌నగర్, మే 2 : ఫరూఖ్‌నగర్ మండలంలోని చింతగూడ, గంట్లవెల్లి, కమ్మదనం, చిల్కమర్రి గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి రైతులు నష్టపోయారు. సుమారు 569 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచన వేశారు. 540 ఎకరాల్లో వరి, 5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల పంటలు, 24 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని, 659 మంది ఆర్థికంగా నష్టపోయారని మండల వ్యవసాయ శాఖ అధికారి నిషాంత్ తెలిపారు. శుక్రవారం నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేశామని, నష్టంపోయిన రైతులకు ఆర్థిక సాయం అందే విధంగా కృషిచేస్తామని తెలిపారు. చిల్కమర్రి గ్రామంలో నష్టపోయిన వరి పంటను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. వడగండ్ల వానధాటికి పంట పూర్తిగా నష్టపోయిందని చింతగూడ గ్రామ రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

**ఆదిబట్ల మున్సిపల్‌లోని**

**పార్కుల నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరు**

**ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ**

**5 పార్కుల ఏర్పాటుకు శ్రీకారం**




ఆదిబట్ల, మే 2: ఆదిబట్ల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టిందని, ఈ పరిధిలో 5 పార్కుల ఏర్పాటుకు రూ.3 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలులో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు కన్సిస్టెంట్ అచీవర్స్ అవార్డును పొందడం జరిగిందని తెలిపారు. అందుకు గుర్తింపుగా మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యం కొరకు ఓపెన్ జిమ్, వాకింగ్ పార్క్, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేకంగా పార్కుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కమిషనర్ కోరడంతో వెంటనే స్పందిస్తూ మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధికి రూ. 3కోట్లు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టికే శ్రీదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

**మున్సిపాలిటీలో 5 పార్కుల ఏర్పాటు..**

రూ.3 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో 5 పార్కులను అభివృద్ధి చేయనున్నారు. 1వ వార్డులోని టీసీఎస్ ఎదురుగా శ్రీమిత్ర కాలనీలో 3 పార్కులు, 9వ వార్డులో 1, 8వ వార్డులో మరొకటి ఏర్పాటు చేయనున్నారు. ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేలా వీటిని తీర్చిదిద్దనున్నారు.



## లయన్స్ క్లబ్ కార్యవర్గానికి సన్మానం

కడ్తాల్, మే 2ః లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నూతన కార్యవర్గాన్ని రెండు రోజుల క్రితం ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ 40వ అధ్యక్షుడిగా ఎంపికైన గోవర్ధన్‌రెడ్డిని, కార్యదర్శి గంప శ్రీనుగుప్తాను బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం నాయకుడు మహేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తమ నియామకానికి సహకరించిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, దామోదర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింహ, రామచంద్రయ్య, నాయకులు వెంకటేశ్, దాసు, ప్రభులింగం, చంద్రశేఖర్, కృష్ణ, సురేశ్, మహేశ్, రాములుగౌడ్, రాజేశ్, వేణు, అంజి పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం



ఇబ్రహీంపట్నం, మే 2 : ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళి, ప్రధాన కార్యదర్శిగా రవికరణ్, ఉపాధ్యక్షుడిగా మహేందర్, అంటాచారి, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా జగన్, స్పోర్ట్స్ అండర్ కల్చరల్ కార్యదర్శిగా ఆర్ వెంకటేష్, లైబ్రేరియన్‌గా నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బానుగౌడ్, రాజ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాములు, జగన్‌గౌడ్ తదితరులున్నారు.

## ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నియామకం



షాద్‌నగర్‌టౌన్, మే 2: షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కొత్త రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, న్యాయవాదులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీలో భాగంగా జిల్లా కోర్టు నుంచి షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా వచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# పొంచిఉన్న ప్రమాదం

**నెలలుగా ఒరిగిన విద్యుత్ స్తంభం**

**పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు**



నందిగామ, మే 2 : నందిగామ మండలం అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి జంగోనిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డుకు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కొన్ని నెలల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని విరిగిపోయి ఒరిగి ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే స్తంభం ఉండటం, సమీపంలోనే ప్రైవేటు పాఠశాల ఉండటంతో ఎప్పుడూ స్తంభం పూర్తిగా విరిగిపడి ప్రమాదం జరుగుతుందోనని పృథ్వి కాలనీవాసులు, ప్రయాణికులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధికి ఆటంకంగా బీజేపీ నేతలు

**బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి**

వనస్థలిపురం, మే 2 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొంతమంది బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారని బీఆర్ఎస్ బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కృషితోఎన్జీవోస్ కాలనీలో గ్రంథాలయ నిర్మాణానికి రూ.1.95 కోట్ల నిధులు మంజురయ్యాయన్నారు. గురువారం ఉదయం శంకుస్థాపన చేస్తే అక్కడ ఏ మాత్రం కూడా ప్రతిఘటించకుండా, ఫొటోలకు ఫోజులిచ్చి సాయంత్రం ఆ శిలాఫలకంలో ఎంపీ ఈటల రాజేందర్ పేరు చిన్న అక్షరాలతో పెట్టారనే నెపంతో పథకం ప్రకారం వాళ్ల అనుచరవర్గాన్ని తీసుకెళ్లి శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం నీతిమాలిన చర్య అన్నారు. ఈ సంఘటన ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసిందని, ఎన్నో రోజులుగా ఈ పనులకు ఆటంకాలు కలిగిస్తున్నారని, ఎట్టకేలకు పనులు ప్రారంభం అయితే ఓర్వలేక మరోసారి అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఈ హేయమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# విద్యార్థులకు ఘన సన్మానం



బండరావిరాల ప్రభుత్వ పాఠశాలలో..



అబ్దుల్లాపూర్‌మెట్ జిల్లా పరిషత్ పాఠశాలలో..

అబ్దుల్లాపూర్‌మెట్, మే 2 : పదో తరగతి 2024-25 పరీక్షా ఫలితాల్లో బండరావిరాల ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులు, తల్లిదండ్రులను గ్రామ స్వేరో సర్కిల్ ఆధ్వర్యంలో స్వేరో సర్కిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ వైస్ చైర్మన్ కందికంటి విజయ్ కుమార్ శుక్రవారం శాలువాలతో సన్మానించారు. అనంతరం నిహారిక 518, ఐశ్వర్య 509, అఖిల్ 500, అనన్య 492 నాలుగు స్థానాల్లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు కాలేజీ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్వేరో నాయకులు ఉన్నారు. అదే విధంగా అబ్దుల్లాపూర్‌మెట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 500 పైన మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఏఏపీసీ చైర్మన్ సంతోష శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, గణిత ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



మొయినాబాద్, మే 2 : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో 197 పశువులకు ఈ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు టీకాలు వేయడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భీంరావు, ఘోరామియా, కుమార్ పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చాలి

చేవెళ్లటౌన్, మే 2: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు శేరిరాజు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలముందు ఇచ్చిన హామీలో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నిర్మాణానికి రూ.5లక్షలు, ఉచిత వైద్యం, పింఛన్, ఉచిత బస్సు పాస్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాడ్గుల, మే 2: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అందుగుల వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ అదే గ్రామానికి చెందిన చెన్నయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆదర్శ మున్సిపాలిటే లక్ష్యం

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

షాద్‌నగర్‌టౌన్, మే 2 : మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలోని 9, 22వ వార్డుల్లో అంతర్గత మురుగుకాలువ, సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు నరేందర్, విశ్వం, మాజీ కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి, సరితాయాదగిరియాదవ్, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా వార్డుల్లో సీసీరోడ్డు, అంతర్గత మురుగుకాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులతో మున్సిపాలిటీ ఆదర్శంగా మారుతుందన్నారు. అదే విధంగా పట్టణాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెన్నయ్య, బస్వం, రాజేందర్ రెడ్డి, ఇబ్రహీం, శ్రీశైలం, యాదగిరి, విజయ్, రఘుమారెడ్డి, ముబారక్, అర్జున్‌లక్ష్మణ్, శ్రీధర్, సురేశ్, రమేశ్ పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



ఆమనగల్లు, మే2: ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన పల్లె ఈశ్వరమ్మకు మంజూరైన రూ.24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆమనగల్లులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తరుపున కేఎన్ఆర్ సేవా దళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



తిరుమలేశ్ (ఫైల్)

ఆదిబట్ల, మే 2: అతి వేగంతో ప్రయాణిస్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన దేరంగుల తిరుమలేష్(35) వృత్తి వ్యాపారం చేస్తున్నాడు. తన కారులో నగరంలోని గచ్చిబౌలి నుంచి బొంగుళూరు వైపు ఔటర్ రింగురోడ్డుపై వస్తుండగా తన కారు అదుపు తప్పి ఔటర్ రింగు రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న తిరుమలేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కొనసాగుతున్న భూ బాధితుల దీక్ష

చేవెళ్ల రూరల్, మే 2 : శంకర్‌పల్లి మండలం కొండకల్, వెలిమెల తండా పరిధిలోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారానికి 112వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. తాము న్యాయబద్ధంగా దీక్షలు చేపట్టి దాదాపు 4 నెలలు అవుతున్నా అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ దీక్షలో బాబు, పి.కవిత, లక్ష్మణ్, గోపి, సోనిబాయి, రవి, శంకర్, తులసి, శంకరమ్మ, మాణెమ్మ, బీఆర్ఎస్ నాయకుడు రాజు పాల్గొన్నారు.

## నకిలీ మందుల విక్రయం

షాబాద్, మే 2 : నకిలీ మందులు విక్రయిస్తున్న విత్తనాల దుకాణంపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాలు.. నాగర్‌గూడ న్యూ మారుతి సీడ్స్ షాపులో సింజెంట కంపెనీకి చెందిన నకిలీ మందులు విక్రయిస్తున్నారని సదరు కంపెనీ మేనేజర్ కేశవ సుధీర్‌కు సమాచారం అందింది. ఆయన అదే కంపెనీలో పనిచేసే రాకేశ్‌తో సీనోడీస్ 200 మి.లీటర్ల మందు కొనుగోలు చేయించాడు. దానిపై ఉన్న లోగోలు వేరుగా ఉన్నట్లు గమనించి, అది నకిలీదని గుర్తించారు. సదరు షాపు యజమాని మక్తగూడకు చెందిన రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సింజెంట కంపెనీ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పెచ్చులూడుతున్నా.. పట్టదా..?

- కలగానే మిగిలిన దవాఖాన భవన నిర్మాణం
- శిథిలావస్థకు చేరిన పాత భవనం
- ఇబ్బందుల్లో సిబ్బంది, రోగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- నూతన భవనం నిర్మించాలని వేడుకుంటున్న జనం



ప్రభుత్వ దవాఖాన పాత భవనం

యాచారం, మే2: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ప్రాథమిక స్థాయి (పీహెచ్‌సీ) నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)గా మారినా దవాఖానకు మాత్రం మంచి రోజులు రావడం లేదు. 60ఏళ్ల క్రితం నిర్మించిన భవనం క్రమ క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటుంది. పైకప్పు పెచ్చులూడిపోయి పడిపోతున్నాయి. వర్షం వస్తే స్లాబ్ నుంచి వర్షం నీరు కురుస్తున్నది. పెచ్చులూడి ఎవరిపైన పడుతుందోనని అటు రోగులు ఇటు సిబ్బంది భయంగా గడుపుతున్నారు. శిథిలావస్థ భవనంతో నిత్యం రోగులు, సిబ్బంది అనేక అవస్థలు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవతో నూతన భవన నిర్మాణానికి రూ.1.50కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆగస్టు17, 2023న మాజీ మంత్రి హరీశ్‌రావు దవాఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతే అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు, కాంట్రాక్టర్లు అటు వైపు చూసిన పాపాన పోలేదు. అసౌకర్యాలతో శిథిలావస్థకు చేరిన భవనంలో వైద్యులు, సిబ్బంది, రోగులు నరకం చవిచూస్తున్నారు. భవన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడి వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

**శిథిలావస్థకు చేరిన భవనం**

మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖానకు ఎంతో చరిత్ర ఉంది. ఒకప్పుడు విశాలమైన భవనంతో 30పడకల దవాఖాన భవనం ప్రజలకు అందుబాటులో ఉండేది. దీంతో మండల వాసులు కాకుండా మంచాల, కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు, చింతపల్లి, మర్రిగూడ, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను వినియోగించుకునే వారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలందించిన భవనం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం భవనం గోడలు పూర్తిగా నెర్రెలుబారి చెట్లకు నిలయంగా మారింది. ఆసుపత్రిలో లోపల పైకప్పు భాగంలో పెచ్చులూడిపోయి సీకులు తేలుతున్నాయి. పెచ్చులూడి ఎవరిపై పడతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో అటు సిబ్బంది ఇటు రోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పలు మార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా సమస్య మళ్లీ మొదటికొచ్చిందని సిబ్బంది వాపోతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పడే అవస్థలు అన్ని ఇన్నీ కావు. ఇందులో విధులు నిర్వహించే స్టాఫ్‌నర్స్, అంటెండర్, సెక్యూరిటీ గార్డ్స్ భయాందోళనకు గురవుతారు. నూతన భవనం నిర్మిస్తే రోగులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొంటున్నారు. అధికారులు దృష్టి సారించి వెంటనే దవాఖాన భవన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**శిలాఫలకానికే పరిమితమైన పనులు**

ప్రభుత్వ భవన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమవుతుందాననే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. 2023ఆగస్టులో శిలాఫలకం వేసినప్పటి నుంచి మళ్లీ దానిగురించి పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. భూమి పూజచేసినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. నూతన భవనం నిర్మిస్తే అన్ని రకాల వసతులతో ఆధునికమైన వైద్యం అందుతుందన్న ప్రజల కల కలగానే మిగిలింది. నిధులు మంజూరైనా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా సమస్య మిగిలిపోయింది. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల ఆశ అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలైతాయో వేచి చూడాల్సిందే.

**భవనాన్ని నిర్మించాలి**



దవాఖాన భవన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడాలి. ఉన్నత అధికారులు తగిన దృష్టి సారించాలి. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

**- భూతరాజు నాగరాజు, యాచారం**

**భయంగా ఉంది..**




దవాఖాన పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు రాలిపడుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తుంది. వర్షాకాలంలో చాలా ఇబ్బందిగా ఉంటుంది. వర్షం కురిసినప్పుడు పైకప్పు ఊరుస్తున్నది. భయంతో విధులు నిర్వహించాల్సి వస్తుంది. పైఅధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న దవాఖాన భవనంపై దృష్టి సారించాలి. అన్ని వసతులు కల్పించి భవనాన్ని నిర్మిస్తే రోగులకు అన్ని రకాల వైద్యం అందించేందుకు కృషి చేస్తాం.

**- రాజ్యలక్ష్మి, వైద్యాధికారిణి యాచారం**



పెచ్చులూడుతున్న దవాఖాన పైకప్ప




నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకం